# కుంటిమందు

ఆ రోజు ఉదయం నాన్నగారు ఆఫీసుకు వెళ్తూ డాక్టరు నరహరి గారి దగ్గరకు వెళ్లి మా నాయనమ్మకు కంటి మందు తీసుకు రమ్మని చెప్పారు.

"వెళ్ళేటప్పుడు మూడోనాలుగో ఖాళీ ఇంజక్షన్ సీసాలు శుభ్రంగా కడిగి తీసుకు వెళ్లడం మర్చిపోకండి" అన్నారు.

మా ఇంటికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండు మైళ్ల దూరంలో ఉంది. అప్పట్లో అది తప్ప మాకు వేరే ఆస్పత్రి లేదు. లోగడ రెండు మూడు సార్లు నరహరి గారి దగ్గరకు వెళ్లాను. ఆయనకు కోపం ఎక్కువ. రోగిని భయపెట్టేస్తాడు. మనం చెప్పేది ఏమాత్రం వినిపించుకోడు. ఆయన చెప్పేదానికి 'అవును' అనడానికి మాత్రం మనకు అవకాశం ఇస్తాడు. మళ్లీ ఆయన దగ్గరకు వెళ్లాలనిపించదు. మా నాన్నగారికి ఆయనంటే గురి.

అన్నయ్యా నేను ఆస్పత్రి చేరుకునేసరికి అదృష్టవశాత్తూ తన గదిలో డాక్టరు గారు ఒక్కరే ఉన్నారు. రోగులు ఎవరూ లేరు. గది బయట స్టూలు మీద బంట్రోతు కూర్చుని ఉన్నాడు. మెలకువగా ఉన్నాడో, నిద్రపోతున్నాడో తెలియడం లేదు. సరాసరి గదిలోకి వెళ్లిపోయి డాక్టరు గారి బల్లకు ఆనుకుని నిలబడ్డాం. మేం వచ్చిన అలికిడికి చేతుల్లో ఉన్న దినపత్రికను కొద్దిగా కిందకు దించి, "ప్రాబ్లం ఏమిటి?" విసుగ్గా అడిగాడు.

"మేం...చలపతిగారి పిల్లలం..." నెమ్మదిగా మొదలుపెట్టాడు అన్నయ్య.

"ఏ చలపతి?"

"రెవెన్యూ డిపార్టుమెంటులో పనిచేస్తుంటారు...నిన్న సాయంత్రం మీతో మాట్లాడారట... కంటిమందుకోసం వచ్చాం..."

ఆయన తల అడ్డంగా ఆడించి, "మీనాన్న ఎవరో నాకు గుర్తు రావడం లేదు... ఇలా దగ్గరకు రండి." అన్నాడు.

అంత కోపిష్టి మాతో అంత మంచిగా మాట్లాడతాడని నేను అనుకోలేదు. సంతోషం వేసింది. ఆయన దగ్గరగా వెళ్లాం. మా కళ్లు పరీక్షించి, "బాగానే ఉన్నాయిగా, మందెందుకు?" అడిగాడు.

"మాకు కాదు. మా నాయనమ్మకు" అన్నాను.

"ఆమేది?"

"తీసుకు రాలేదండీ"

"ఆమెను చూడకుండా మందెలా ఇచ్చేది?"

"మా నాన్నగారు...." అంటోంటే నా మాటలకు అడ్డుతగిలి,

"మీ నాన్నగారెవరో నాకు గుర్తురావడం లేదు... పోనీ ఒ.పి.కార్డు రాయించారా?" అడిగాడు.

అవుట్ పేషెంట్ కార్డు రాయించాలని మాకు తెలియదు.

"లేదండి" అన్నాడు అన్నయ్య.

"బయట వరండా చివర్లో కార్డులు రాసే సిస్టరు ఉంటుంది. కార్డు రాయించుకుని రండి వెళ్లండి..." రవంత కోపంగానే అన్నారు.

ఆయన గదిలోంచి అలా బయటకు వచ్చామో లేదో నలుగురు ఆయన గదిలోకి దూరారు.

కార్డులు రాసే సిస్టరు చుట్టూ ఇరవయిమందికి పయిగానే ఉన్నారు. "క్యూలో రండి. క్యూలో రండి" అని ఆమె అందరితోనూ అంటోంది. ఎవరూ కదులుతున్నట్లు అనిపించలేదు. అసలు క్యూ ఎక్కడ మొదలయిందో మాకు అంతుబట్టలేదు. ఆమె వెనక కూడా మనుషులు ఉన్నారు.

అన్నయ్య నెట్టుకుంటూ జనాల్లోకి చొచ్చుకుపోయి ఇరవయి నిమిషాల తర్వాత నాయనమ్మ పేరున ఒ.పి. కార్డు రాయించి తీసుకొని గుంపులోంచి బయటకు వస్తూ ఎవరిదో లుంగీతోపాటు వచ్చేశాడు. ఆ లుంగీ తాలూకు మనిషి తోపులాటలో తన లుంగీ తనను వీడిపోయిన సంగతి గమనించాడో, లేదో, మరో ఆచ్ఛాదన ఉందో, లేదో? లుంగీ శుభ్రంగానే ఉంది.

"దీన్ని ఇంటికి తీసుకు వెళ్దామా?" అడిగాడు అన్నయ్య దాన్ని చక్కగా మడతలు పెడుతూ. మరీ కొత్తదేమీ కాదు.

"వద్దు, పడేసేయి" అన్నాను.

"బావుందిరా."

"దీన్ని ఇంటికి తీసుకు వెళ్తే నాన్నగారు నిన్నూ, నన్ను బాదుతారు. ఈ లుంగీ పోయిన మనిషి అది మన చేతుల్లో ఉండడం చూశాడంటే మనల్నిద్దరినీ పట్టుకుని ఉతికిగాని వదలడు. పయిపెచ్చు అంతకు ముందు పోయిన తన లుంగీలన్నీ మనమే తీసుకు వెళ్లామని అనుకుని వాటిని కూడా తీసుకొచ్చి ఇవ్వమని తప్పకుండా అడుగుతాడు. "రేయ్, ఎందుకొచ్చిన బాధలు మనకు? దాన్ని అవతల పడేయి" అన్నాను.

అసలు నా మాట ఎప్పుడూ వినని అన్నయ్య అప్పుడు మటుకు నా మాట విని లుంగీ పక్కనే ఉన్న కిటికీ మీద పెట్టీ పెట్టగానే అవతలి వయిపు నుండి ఎవరో దాన్ని ఒడుపుగా లాగేశారు. లుంగీ పోగొట్టుకున్న వ్యక్తి మీద జాలి వేసింది. ఒ.పి.కార్డు రాయించుకునేప్పుడయినా చూసుకుంటాడా? లుంగీ లేని వాళ్లకు ఆమె కార్డు రాస్తుందో, లేదో?

డాక్టరు గారి గది దగ్గరకు వెళ్లాం. బయట స్టూలు మీద బంట్రోతు కూర్చుని నిద్రపోతున్నాడు. అతన్ని లేపలేదు. గదిలోకి నడిచాం. ఆయన ఇందాకటిలా తీరికగా లేడు. ఆయన చుట్టూ నలుగురు పేషంట్లు ఉన్నారు. ఒక చేత్తో ఒకతని నాడి చూస్తున్నాడు. అతని నోట్లో థర్మామీటరు ఉంది. మరో రోగిని స్టెతస్కోపుతో పరీక్షిస్తున్నాడు. ఇంకో రోగి నాలుక బయట పెట్టి ఆయనకు చూపిస్తున్నాడు. నాలుగో అతను తన చెవి చూపిస్తూ తన బాధ గురించి చెబుతున్నాడు. సింగిల్ విండో కాన్సెప్ట్ ఆయన మనసులో అప్పటికే పాతుకుపోయి ఉండాలి.

మా సీనియారిటీ కోల్పోయాం. ఆయన ఆ నలుగురినీ ఉమ్మడిగానే చూడడానికి అరగంట తేలికగా పడుతుంది.

"వీళ్లందరి కంటే మనం ముందొచ్చాం" అన్నయ్య నాతో చిన్నగా, అసహనంగా అన్నాడు.

"అవును. ఇప్పుడేం చేద్దాం?" అన్నాను.

"నాయనమ్మ కంటి మందు గురించి అడగరా"

"నువ్వు అడగొచ్చు కదా?"

మాట ముగించానో, లేదో అన్నయ్య తన గుప్పిటతో నా డొక్కలో ఒకటిచ్చేసరికి, అలా చేస్తాడని ఊహించని నేను తూలి డాక్టరుగారు కూర్చున్న కుర్చీ పక్కనే ఉన్న నీళ్ల బేసిన్ మీద పడడంతో అది బల్లమీద పడింది.

బల్లమీదున్న వస్తువులు తడిచి పోవడమే కాకుండా ఆయన ఒళ్లోకూడా నీళ్లు పడేసరికి ఆయన చటుక్కున లేచి నుంచునే సరికి కుర్చీకున్న మేకు తగిలి పంట్లాం పర్రుమంటూ చినిగిపోయింది. మనిషి కాస్త స్థూలకాయుడు. మేకు నుండి తప్పించుకోవడం తేలికేం కాదు. పంట్లాం చాలా మటుకు చినిగి ఉండాలి. పెద్ద శబ్దమే అయింది. ఆ శబ్దానికి ఆయన దగ్గరున్న రోగులు దూరంగా జరిగారు. ఒక్కతని విషయంలోనే అనుమానం వేసింది. అతని నోట్లో థర్మామీటరు ఉంది. దాన్ని తీసి డాక్టరుగారికి ఇచ్చినట్టు లేదు. ఈ హడావిడిలో మింగేసి ఉంటాడా?

అలా జరుగుతుందని నేను ఊహించలేదు. ఆయన అసలే ఎర్రటి మనిషి. కోపంతో ముఖం కందగడ్డలా అయిపోయింది. ఆయనకు దగ్గరగా మేం ఉండుంటే కొట్టేవాడేమో! పంట్లాం చిరిగి మాకు మంచి పనే చేసింది. ఆయన నిలబడిన చోట నుండి ముందుకు రాలేదు. బడిలో హెడ్‌మాస్టారు బెత్తానికి అందకుండా దూరంగా నుంచోవడం బాగా అలవాటు కాబట్టి ఆటోమెటిక్‌గా అడుగులు వెనక్కి వేశాం.

"క్షమించండి... పొరపాటయింది...ఉద్దేశపూర్వకంగా చేయలేదు...మా నాయనమ్మ కంటిమందు..." బతిమిలాడుతున్నాను.

"గెటవుట్" ఆయన పెద్దగా అరిచేసరికి బంట్రోతు గదిలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు.నిద్రమత్తు పూర్తిగా వదలని అతనికి పరిస్థితి అర్థం అయినట్టు లేదు.

మా వంక చేయి చూపిస్తూ, "ఈ కుర్రాళ్లను తన్ని తగలెయ్. వీళ్లనెప్పుడూ ఈ దరిదాపుల్లోకి రానీయకు... దొంగరాస్కెల్స్..." కోపంతో ఊగిపోతూ అరుస్తోంటే, నిజం చొప్పొద్దూ నాకు ముచ్చట వేసింది. చదువుకున్న వాళ్లు, అందులో అంత పెద్ద మనిషి శివాలెత్తినట్టు కేకలు పెడుతోంటే నిలబడి కొద్దిసేపు చూద్దామనిపించింది. బంట్రోతు మా వెంటబడడం వలన అది కుదరలేదు. అతనికి దొరకలేదు. బయటకు పరిగెత్తాం. మమ్మల్ని పట్టుకునే వాడే. మెయిన్ గేటు దగ్గర పందుల మంద అడ్డం వచ్చేసరికి ఆగిపోయాడు. లేకుంటే అతనికి దొరికిపోయే వాళ్లం.

అరఫర్లాంగు పరుగెత్తి మా వెనక ఎవరూ రావడం లేదని నిర్ధారించుకున్నాక ఆగి అలుపు తీర్చుకోడానికి, అక్కడో చిన్న వంతెన కనిపిస్తే దానిమీద కూర్చున్నాం. అలుపు తీసుకుంటూ, "మనం దొరికి ఉంటే పోస్టుమార్టం చేసి ఉండేవాడు." అన్నాడు అన్నయ్య.

అప్పట్లో పోస్టుమార్టం అంటే నాకు తెలియదు. పోస్టు ఆఫీసు వాళ్లకు సంబంధించిన విషయం కాబోలు అనిపించింది.

అలుపు తగ్గాక, "ఇప్పుడేం చేద్దాం?" అడిగాను.

"చూడరా. ఉత్తి చేతులతో వెళ్తే నాన్నగారు ఊరుకోరు. నువ్వేం చేస్తావో నాకు తెలియదు. డాక్టరు గారి మీద నీళ్లు పడేసింది నువ్వు. నేను కాదు. నాన్నగారడిగితే నీపేరే చెబుతాను. నేను స్కూలుకువెళ్లాలి. ప్రయివేటు క్లాసు ఉంది..." కుడిచేయి గాలిలో ఊపుతూ వెళ్లిపోతోంటే, "అరేయ్ అన్నయ్యా, మాట" అన్నాను. వాడు ఆగలేదు. ప్రయివేటు క్లాసు లేదు, పాడూ లేదు. స్కూల్లో ఆటలాడుకుంటూ ఉండిపోతాడు. వాడు ఎప్పుడూ ఇంతే. నన్ను ఇరకాటంలో పెట్టేస్తుంటాడు.

చాలా సేపటివరకు వంతెన మీద కూర్చుండిపోయాను. ఏం చేయాలో తోచడం లేదు. నాన్నగారు అన్నయ్య మాటే వింటారు. నేనేం చెప్పినా లాభం ఉండదు. ఇంట్లో తన్నులు ఎప్పుడూ నాకే పడుతుంటాయి. ఆస్పత్రికి వెళ్లి ఎట్టి పరిస్థితుల్లోనూ మందు తీసుకు రాలేను. ఎంత ఆలోచించినా నాకు ఏ దారీ కనబడడం లేదు. చివరకు నాన్న గారి చేత తన్నులు తినడానికే సిద్ధపడి లేచి నిలబడ్డానో లేదో రోడ్డుకు అవతల ఉన్న చెరువును చూడగానే ఆలోచన కలిగింది.

అది మంచి ఆలోచన కాకపోయినా అది తప్ప నాకు వేరే మార్గం లేదు. చెరువులోకి దిగి నాలుగు ఇంజక్షన్ సీసాలు నిండా నీళ్లు నింపి రబ్బరు మూతలు పెట్టాను. చొక్కాతో సీసాలు శుభ్రంగా తుడిచి అలాగే భద్రంగా పట్టుకుని ఇంటికి చేరుకుని నాయనమ్మకు ఇచ్చాను.

ఆమె మూడుసీసాలను బల్ల సొరుగులో పెట్టుకుని నాలుగో సీసా మూత తెరిచి కళ్లల్లో చుక్కలు వేసుకుంటోంటే ఏమయినా అవుతుందని భయం వేసింది. చెరువులోవి ఏమాత్రం మంచి నీళ్లు కావు. అన్ని పనులతో పాటు మా ఊళ్లో చాలా

మంది గొడ్లను కూడా అక్కడే కడుగుతుంటారు. ఏదయినా జరగకూడనిది జరిగితే ఇంట్లోంచి పారిపోదామనిపించింది. మానసికంగా తయారయి ఉన్నాను.

నాయనమ్మ పది నిమిషాల పాటు కళ్లు మూసుకుని కుర్చీలో కూర్చుంది. ఆ తర్వాత నెమ్మదిగా కళ్లు తెరిచే వరకు నా గుండె వేగంగా కొట్టుకుంటూ ఉంది. "ఎలా ఉంది నానమ్మా?" అడిగాను. "బావుందిరా" అన్నాక గాని నా మనసు కుదుటపడలేదు. రెండుమూడు సార్లు వేసుకున్నాక ఆమె కళ్లజబ్బు తగ్గు ముఖం పట్టింది. మరుసటి రోజుకు పూర్తిగా నయం అయింది.

ఎక్కడి నుండి కంటిమందు తీసుకువచ్చానో నేను ఎవరికీ చెప్పలేదు. చెరువునీటి మ్మహత్యం అని అనుకోను. గమ్మత్తేమింటే ఆ తర్వాత నాయనమ్మ కంటి జబ్బుతో ఎప్పుడూ బాధపడలేదు. బతికున్నన్నాళ్లూ మాటల్లో కంటి జబ్బు విషయం వచ్చిందంటే, "హస్తవాసి అంటే ఆ డాక్టరుగారిధిరా, నాకళ్లు చూడకుండా మందిచ్చి, మళ్ళీ రాకుండా చేశాడు" అంటుండేది.

*(నాయనమ్మ బండారు అచ్చమాంబ (సలోమి) స్మృతికి)*

**❖ రచన, ఆదివారం వార్త, 16 సెప్టెంబర్ 2007**